# శంఖు, చక్ర, నామములు

తిరుపతి మొదలైన దేవస్థానములందు శంకు, చక్ర, నామములు మాత్రమే ప్రతిష్ఠించి ఉంచడము గమనార్హము తమిళనాడులో కొన్ని దేవాలయముల ప్రాంగణముల మీద శంఖు, చక్ర, నామదర్శనము కలవు. అలాగే దేవతా పటములుగ శంఖు చక్రనామములు గల చిత్రములు కూడ ఉన్నవి. అన్నిటికంటే తిరుపతి తిరుమలలోనే ఎక్కువగ శంఖు చక్రనామముల దర్శనము కలదు. అట్లే నామముగల దేవతల చేతులందు కూడ శంఖు చక్రములుండును. దేవాలయములోని ప్రతిది ఆత్మ జ్ఞానార్థమే అయినపుడు శంఖు చక్రనామములకు కూడ విశేషార్థమే ఉండును. అది ఏమనగా!

ఒక యుద్ధము జరుగబోవుననుకోండి, అక్కడ మొదట అరుపులు, కేకలు, శంకారావములు, ఢంకా రావములు మొదలైన పెద్దకోలాహల మేర్పడును. తర్వాత నాశనమేర్పడును. అట్లే కర్మ నాశనమునకు యోగసాధనయను యుద్ధము చేయవలయును. ఆ యోగసాధనను యుద్ధము శబ్దము లేకుండ మొదలు కాదు. గురువు నుండి బయల్పడు జ్ఞాన బోధలను శబ్దము మొదట కలుగవలెను. జ్ఞానబోధయను శబ్దము శరీరములోని మనస్సుకు చేరిన తర్వాత యోగసాధనను యుద్ధము మొదలగును. చిన్న పోట్లాట మొదలుకొని పెద్ద యుద్ధముల వరకు శబ్దము లేకుండ ఏమాత్రము జరుగనట్లు, కర్మయను శత్రువు మీదికి యోగసాధనను యుద్దము జ్ఞానశబ్దము లేనిది ఏమాత్రము జరుగదు. అందువలన జన్మరాహిత్యమునకు, ఆత్మ దర్శనమునకు మొదట జ్ఞానమవసరము తర్వాత యోగమవసరము. జ్ఞానములేనిది యోగము రానించదు. *"శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్, జ్ఞానాద్ధ్యానం విశిష్యతే"* అని భగవద్గీత కూడ బోధించుచున్నది.

శంఖమునుండి ఉద్భవించునది శబ్దము. జ్ఞానము శబ్దముతో కూడుకొన్నది. కావున జ్ఞానము మొదట ప్రతి మానవునికి ఉండవలెనను ఉద్దేశముతో నామముకు ఎడమ ప్రక్క శంఖమునుంచారు. జ్ఞానముచే యోగసాధన చేయువానికి యోగము లభించి కర్మను కాల్చివేయును. కనుక కర్మ నాశనమగుటకు చక్రమును చూపించారు. మొదట జ్ఞానశబ్దమను శంఖారావముచేసి తర్వాత యోగసాధనను యుద్దము చేసిన యోగశక్తియను చక్రముచేత కర్మయను శత్రువు నశించునను ఉద్ధేశముతో కుడి ప్రక్కన చక్రమునుంచారు. జ్ఞానములేనిది జ్ఞానశక్తిలేదు. కనుక శంఖము లేకుండ చక్రమును ఎక్కడ ఉంచరు. ఎక్కడైనగాని శంఖు చక్రముల రెండు గుర్తులుండును. ఈ రెండు గుర్తులకు మధ్య నామము ఉండును. అట్లులేని యెడల నామముగల



**శంఖు, చక్ర, నామము**

దేవుడయిన ఉండును. ఈ విధముగ శంఖు చక్రములకు మధ్యన నామమో లేక నామముగల దేవుడో ఉండడము యొక్క కారణమేమనగా!

జ్ఞానము కల్గి యోగమాచరించిన వారికి యోగశక్తి (జ్ఞానశక్తి) చేత కర్మ కాలిపోవును. అటువంటివాడు మోక్షము పొందును. అందువలన బ్రహ్మనాడిగ గుర్తింపు పొందిన నామమును అక్కడ చూపడము జరిగినది. నామము పై భాగము యొక్క మొన శూన్యమును చూపుచున్నది. కావున శంఖు చక్రములు కల్గిన నేను మోక్షమందున్నానని దేవాలయ ప్రతిమ చూపుచున్నది. అట్లే జ్ఞానము యోగశక్తి కల్గినవాడు మోక్షమును పొందునని జ్ఞానచిహ్నముగ శంఖమును, మోక్ష చిహ్నముగ నామమును, కర్మనాశన శక్తి చిహ్నముగ చక్రమును చూపడము జరిగినది. పెద్దలు పెట్టిన చిహ్నములుండిన వాటికి సంబంధించిన ఆత్మజ్ఞాన వివరములు ఈ దినములలో లేవు. కావున చదువరులు బాగ అర్థము చేసుకొని ఆచరించవలెను.